
# నమస్తే తెలంగాణ

## జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 21 మార్చి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

## కౌలుకు చేసి కాడుపడినం

- బోర్లల్లో నీళ్లు బంద్ • రెండున్నర ఎకరాల్లో ఎండిన పంట
- దిక్కుతోచని స్థితిలో కామారం రైతు చంద్రయ్య

నవాబ్‌పేట, మార్చి 20 : మండలంలోని కామారం గ్రామానికి చెందిన రైతు గరిగె చంద్రయ్య తనకున్న రెండున్నర ఎకరాల్లో వరి సాగు చేశాడు. నీటి వసతి లేకపోవడంతో పొలంలో ముందు ఒక బోరును 350 ఫీట్లు డ్రిల్ చేయించగా చుక్క నీరు రాలేదు. ఇటీవల మరో బోరును 300 ఫీట్లు డ్రిల్లింగ్ చేయించగా.. కొద్దిపాటి నీళ్లు వచ్చాయి. ఈ బోరు ఆధారంగా రూ.లక్ష ఖర్చు చేసి వరి సాగు మొదలుపెట్టాడు. అయితే కరెంట్ సమస్యలతోపాటు భూగర్భ జలాలు ఇంకిపోవడంతో పంటకు నీళ్లు సరిపడక రెండెకరాల్లో వరి ఎండిపోయింది. మూడు నెలల కష్టం పోయిందని.. పైగా అప్పులు మిగిలాయని సదరు రైతు ఎండుతున్న పొలాన్ని చూసి కన్నీరుపెట్టుకుంటున్నాడు.

## ఆరేండ్ల సంబురం.. ఏడాదిలోనే మాయం



పాలమూరు, మార్చి 20 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని గాజులపేట, అల్లీపూర్, జమిస్తాపూర్, కోడూరు గ్రామాల్లో అప్పులు చేసి సాగుచేసిన పంటలు ఎండుముఖం పట్టాయి. జమిస్తాపూర్‌కు చెందిన గొల్ల కనకయ్య 3ఎకరాల్లో రూ.55వేలు పెట్టుబడి పెట్టి వరి పంట సాగుచేశాడు. పంట చేతికొచ్చే సమయానికి నీరు అందక దాదాపు రెండున్నర ఎకరాలు ఎండిపోయింది. పంటలను కాపాడుకోవాలని రూ.50వేల ఖర్చుతో 550ఫీట్లలో బోరు వేయిస్తే సుక్క నీరు రాలేదు. పక్కనే చెరువు ఉన్న బోరులో నీరు లేక భూగర్భజలాలు అడుగంటి బోర్లు పనిచేయక పంటలు ఎండిపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఇలా ఒక్క కనకయ్యే కాకుండా చాలా మంది ఆశతో సాగుచేసిన పంటలు నీళ్లు లేక ఎండిపోగా పశువులకు మేతగా వదిలేశాడు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు పండుగలా పంటలు పండిచ్చుకునేటోళ్లమని, నేడు అన్నీ నష్టపోయినా అడిగే నాథుడే లేడని రైతు కనకయ్య వాపోయాడు



బీసీ నేతలతో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## జనగణనలో కులగణన చేపట్టాలి

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 20 : దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని మాజీ మంత్రి, ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం కర్ణాటక రాష్ట్రం బెంగళూర్ ప్యాలెస్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ఓబీసీ జాతీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడుగుల బతుకులు మారాలంటే కేంద్ర ప్రభుత్వం తప్పకుండా కులగణన చేపట్టి ఎవరి వాటా ఎంతో తేల్చాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులను తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని, పార్లమెంట్‌లో బిల్లును చట్ట సవరణ చేయాలన్నారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. 42శాతం రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజే హరిప్రసాద్, ఎమ్మెల్సీ మల్కయ్య, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీ నర్సయ్య, బాల్‌రాజ్, ఓబీసీ కర్ణాటక అధ్యక్షుడు గోపి, బెంగళూర్ ఓబీసీ అధ్యక్షుడు భాస్కర్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత జిల్లాకు సీఎం మొండి చెయ్యి

- మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నోరెత్తితే నల్లమల్లలో పుట్టిన, వనపర్తిలో చదివి, కల్వకుర్తిలో పెరిగిన, కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన, పాలమూరు ప్రాంతం నుంచి రెండో ముఖ్యమంత్రిగా ఎదిగిన అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో మాత్రం ఉమ్మడి పాలమూరుకు మొండి చేయి చూపించారు. బీఆర్‌ఎస్ హయాంలో 90శాతం పనులు పూర్తి చేసుకున్న పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులకు మరో పదిశాతం పనులకు నిధులు కేటాయిస్తే కాల్వలు పూర్తయ్యి జిల్లా సస్యశ్యామలమయ్యేది. ఇలా చేస్తే కేసీఆర్ పాలనకు మంచి పేరు వస్తుందనే భయంతో నిధులు కేటాయించలేదు. దీని వల్ల రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. ఎన్నికల సమయంలో కొడంగల్, నారాయణపేట తనకు రెండు కండ్ల వంటివని, హైదరాబాద్ సికింద్రాబాద్ మాదిరిగా అభివృద్ధి చేసుకుందామని చెప్పి ఏడాదిగా కొడంగల్‌కు వచ్చిన నిధుల్లో కనీసం ఒక్క శాతం నిధులు కూడా నారాయణపేటకు రాలేదు. ఇదేనా నీ రెండ్లు కండ్ల సిద్ధాంతం. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి వాటి ఊసెత్తకపోవడం, పైగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే మరో మారు ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తున్న విషయం స్పష్టమవుతున్నది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పక తప్పదు. – నారాయణపేట



పాలెం దవాఖాన ఆవరణలో దగ్ధమైన అంబులెన్స్

## అంబులెన్స్ దగ్ధం

బిజినేపల్లి, మార్చి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెం గ్రామంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉన్న అంబులెన్స్ దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు.. గతంలో పాలెం దవాఖాన పరిధిలోని ప్రాంతాల్లో వృద్ధుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం.. ఆలనా పేరుతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. కాగా ఇటీవల దానిని ఉపయోగించకపోవడంలో దవాఖాన ఆవరణలో ఓ వైపు నిలిపారు. కాగా బుధవారం రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని దగ్ధమైంది. సమాచారం అందడంతో ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. అప్పటికే అంబులెన్స్ పూర్తిగా కాలిపోయింది.

వేసవి ప్రారంభంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటికి కష్టం మొదలైంది. భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయాయి. బోరు, బావులు, చెరువులు ఎండిపోతుండడం.. ప్రాజెక్టుల్లో నీటిమట్టం గణనీయంగా తగ్గిపోతుండడం.. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోవడం.. ప్రభుత్వం సాగునీటిని ఒడిసిపట్టడంలో ముందుచూపు లేకపోవడం.. ఇవన్నీ యాసంగి సాగుకు శాపంగా మారాయి. దీంతో నేడు బోర్లు, కాల్వలు వట్టిబోయి పంట చేలు ఎండుతున్నాయి. పంట చేతికొచ్చే దశలో రైతుల ఆశలన్నీ నిరాశగా మారాయి. ఇప్పటికే వరి పొలాలు నీళ్లులేక నెర్రెలుబారగా.. రైతన్నకు గుండెకోత మిగులుతోంది. కొందరు రైతులు తడి కోసం తాపత్రయపడుతున్నారు. అయినా నీటి వసతి లేక కష్టపడి సాగు చేసిన పంట చేతికందక ఆందోళన చెందుతున్నాడు.

– నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, మార్చి 20



జడ్చర్ల మండలంలో నీళ్లు లేక ఎండుతున్న వరి

# నెర్రెలు బారుతున్న నేల

- పంట పొలాలకు అందని నీళ్లు
- గణనీయంగా తగ్గిన భూగర్భ జలాలు
- పలు చోట్ల వట్టిపోతున్న బోరుబావులు
- అడుగంటుతున్న చెరువులు, ప్రాజెక్టులు
- తడి కోసం తపన పడుతున్న రైతులు
- పంట చేతికొచ్చేనా అంటూ దిగాలు



జడ్చర్ల మండలం కోడ్గల్ గ్రామ శివారులో ఎండిపోతున్న వరి పైరును చూపిస్తున్న రైతు చిన్నోజీ

జడ్చర్ల, మార్చి 20 : యాసంగి సాగు రైతులకు కన్నీరే మిగిలిస్తున్నది. ఎంతో ఆశతో సాగు చేయగా, విద్యుత్ కోతలు.. సాగునీటి సదుపాయం లేక పంటలు ఎండుముఖం పట్టాయి. భూగర్భజలాలు అడుగంటడంతో బోరుమోటర్లు సైతం పనిచేయడం లేదు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. జడ్చర్ల మండలంలోని కోడ్గల్, కర్వపల్లి, మల్లెబోయిన్‌పల్లి, పోచమ్మగడ్డతండా తదితర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. 20రోజులుగా నీళ్లు రాక అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పెడచెవిన పెట్టడంతో ఎకరాకు రూ.25-30వేల పెట్టుబడి పెట్టి నిండా మునిగామని వాపోతున్నారు. జడ్చర్ల మండలంలో 8వేలకు పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. పంటలన్నీ ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో పడిపోయామని, ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



జడ్చర్ల మండలంలో సన్నగా నీటిని పోస్తున్న బోరు

### కన్నీళ్లే మిగిలాయి..



రూ.వేలకు వేలు పెట్టుబడి పెట్టి పంటలను సాగుచేస్తే మధ్యలోనే ఎండిపోయాయి. ఉన్న బోర్లు కూడా నీళ్లు పో యడం లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు. పంటలు ఇంకో ఐదారు రోజులైతే చేతికొచ్చే పరిస్థితి లేదు. చేతికొచ్చిన పంట ఎండిపోతుంటే కన్నీళ్లొస్తున్నాయి. ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టినం. పైసలన్నీ మట్టిలో పోసినట్లయ్యింది. ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

**- చిన్నోజీ, రైతు, కోడ్గల్, జడ్చర్ల**

### రైతులను ఆదుకోవాలి..



రూ.లక్ష పెట్టుబడి పెట్టి ఐదెకరాల్లో వరి పంట సాగు చేశా. ఆరేండ్లలో ఎన్నడూ పంటలు ఎండిపోలేదు. ఈ ఏడాది అదే ధైర్యంతో సాగు చేయగా, పంట చేతికొచ్చే దశలో ఎండిపోయింది. చేసేది లేక గొర్రెలకు మేతగా వదిలేశా. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

**- తలారి మల్లేశ్, రైతు, మహ్మదాబాద్, మహబూబ్‌నగర్ జిల్లా**



ఎండిన చేనులో రైతు కుర్వ శేఖర్

### పాతాళానికి జలం.. మేతకు పొలం

మహ్మదాబాద్, మార్చి 20 : యాసంగిపై కోటి ఆశలతో సాగుచేసిన వరిపంట రైతులకు నిరాశను మిగిల్చాయి. భూగర్భజలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయి. ఉన్నబోర్లు నీళ్లు పోయకపోవడంతో ఆశ చావక పంటలను కాపాడుకునేందుకు కొత్త బోరు వేయించి రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మహ్మదాబాద్‌కు చెందిన రైతు కుర్వ శేఖర్ రెండెకరాలల్లో వరి సాగు చేయగా.. నీళ్లు లేక ఎండింది. ఆరేడేండ్ల నుంచి బోర్లు నీళ్లు పోశాయని, ఒక్కసారిగా వట్టిబోవడంతో రైతు ఆందోళన చెందాడు. రైతుభరోసా టైంకు రాక అప్పులు తెచ్చి సాగుబడు చేశామని, అయినా పంట చేతికిరాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.



ఎండిపోయిన వరిచేనులో దిగాలుగా రైతు

### ఆరెకరాలు ఆవిరి

హన్వాడ, మార్చి 20 : భూగర్భజలాలు అడుగంటడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని తిరుమలగిరికి చెందిన రామలింగం, శివరాజ్ ఇద్దరూ అన్నదమ్ములు. ఎకరాకు రూ.30వేల చొప్పున ఖర్చు చేసి ఆరెకరాల్లో వరి సాగుచేశారు. పంటచేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు అడుగంటి బోర్లు చుక్క నీళ్లు పోయడం లేదు. రూ.2లక్షలు అప్పు చేసి పంటలు సాగు చేయగా, పంట ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదని వాపోతున్నారు. సర్కారు సాయం అందించి మమ్మల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# 'పది' పరీక్షలకు వేళాయే..

- నేటి నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్షల నిర్వహణ
- ఉమ్మడి జిల్లాలో 45,574 మంది విద్యార్థులు
- 235 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



మహబూబ్‌నగర్‌లోని న్యూటౌన్ పరీక్షా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 20 : ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకం. ఒత్తిడి అధికంగా ఉండే ఈ సమయంలో ఆరోగ్యంగా ఉండటంతో పాటు మానసికంగా చురుకుగా ఉంటే విజయం సాధిస్తారని నిపుణులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 'పది' పరీక్షలను 45,574 మంది విద్యార్థులు రాయనుండగా, ఇందుకు 235 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### జిల్లాల వారీగా విద్యార్థులు, కేంద్రాలు..

| జిల్లా | కేంద్రాలు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 60 | 6,543 | 6,226 | 12,769 |
| నారాయణపేట | 39 | 3,586 | 4051 | 7637 |
| గద్వాల | 40 | 3,851 | 3,866 | 7,717 |
| వనపర్తి | 36 | 3,419 | 3,434 | 6,853 |
| నాగర్‌కర్నూల్ | 60 | 5,273 | 5,325 | 10,598 |

**నేటి నుంచి ఏప్రిల్ 4 వరకు..**

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. భౌతికశాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు మాత్రం ఉదయం 9:30 నుంచి 11:00గంటల వరకు మాత్రమే ఉంటాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో వసతులను జి ల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. కొన్ని కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు..**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్షేత్రస్థాయిలో పరీక్షలు సజావుగా జరిగేందుకు విద్యా, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలు ఆయా జిల్లా కలెక్టర్ల ఆదేశాల మే రకు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఉక్కపోత, తాగునీటి స మస్యలు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేందుకు వీలుగా ఎంఈవోలు, కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాల్లోని పరీక్షా కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ప్రతి కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారితోపాటు సిట్టింగ్‌స్క్వాడ్స్ అందుబాటులో ఉండనున్నారు. ఆకస్మిక తనిఖీలకు గానూ జిల్లాల వారీగా ప్రతి జిల్లాలో నాలుగు నుంచి ఆరుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. వీరితోపాటు 20మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2,280 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

## వెల్దండలో కల్తీ పెట్రోల్

- పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు

వెల్దండ, మార్చి 20 : వెల్దండ మండలం గుండాలకు చెందిన పర్వత్‌రెడ్డి పవనపుత్ర హెచ్‌పీ పెట్రోల్ బం కులో బుధవారం సాయంత్రం రూ.200ల పెట్రోల్ పోయించుకొని కొంత దూరం వెళ్లేసరికే బైక్ ఆ గిపోయింది. పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న మెకానిక్ షా పులో బైక్ రిపేరుకు ఇవ్వగా, రెండు లీటర్ల పెట్రోల్ పోయించగా, లీటరు వరకు నీళ్లు ఉన్నట్లు గు ర్తించారు. దీంతో వాహనాదారుడు నీళ్లు కలిసిన పె ట్రోల్ బాటిల్‌తో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చే శాడు. పోలీసులు సంబంధిత శాఖ అధికారులకు స మాచారం ఇవ్వడంతో జిల్లా సివిల్ సప్లయ్ అసిస్టెంట్ హైదర్ అలీ, డీటీ దీపిక పెట్రోల్ బంక్ వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. పెట్రోల్‌ను టెస్టింగ్‌కు పంపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కల్తీ పెట్రోల్‌తో పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు

## కొన 'సాగుతున్న అన్వేషణ'

- ఎస్‌ఎల్‌బీసీ వద్ద సహాయ చర్యలు
- ఐదు షిఫ్టుల్లో ప్రత్యేక బృందాలతో పనులు



అచ్చంపేట, మార్చి 20 : ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఏడుగురి మృతదేహాల కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. 27 రోజులుగా ఆర్మీ, జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతినిధులు, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, దక్షిణ మధ్య రైల్వే, అన్వీ రోబోటిక్స్, ర్యాట్‌హోల్ మైనర్స్, కడావర్ డాగ్ స్క్వాడ్ తదితర బృందాలతో 27 రోజులుగా సహాయక చర్యలు ముమ్మరంగా చేపడుతున్నా ఫలితం లేకుండా పోతున్నది. గురువారం టన్నెల్ వద్ద గల కార్యాలయంలో ఆర్మీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ అజయ్‌మిశ్రా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తదితరులు సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు. స్టీల్, మట్టిని పూర్తిగా తొలగించేందుకు సహాయక బృందాలు రోజుకు ఐదు షిఫ్టుల్లో ఉదయం 7, 11, మధ్యాహ్నం 3, రాత్రి 7, 11గంటల వారీగా షిఫ్ట్ పద్ధతిలో ప్రత్యేక బృందాలు సహాయక చర్యలు సాగిస్తున్నాయి. టన్నెల్ లోపల రక్షణ ప్రమాణాలను పాటిస్తూ చర్యలను వేగవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. డీ-1, డీ-2, ఏ-5 ప్రదేశాల్లో మృతదేహాల వెలికితీతకు అన్వేషణ చేస్తున్నారు. నీటి ఊట ఆటంకం కలిగిస్తుండగా.. రోబోల సేవలు అందుబాటులోకి రాలేదు. సొరంగం చివర్లో 30మీటర్ల ప్రదేశం ప్రమాదకరంగా ఉన్నది. సాంకేతిక కారణాల వల్ల రోబోలతో సహాయక చర్యలు ప్రారంభం కాలేదు. డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగుతున్నది. మట్టి, బురద, శకలాలు బయటకు తరలిస్తున్నారు.

## అంతర్జాతీయ సదస్సుకు శివారెడ్డి

నారాయణపేట, మార్చి 20 : జపాన్‌లో జరిగే సుకురా అంతర్జాతీయ సదస్సుకు దామరగిద్ద సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి శివారెడ్డి ఎంపిక జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. గురువారం విద్యార్థి శివారెడ్డి, గైడ్ టీచర్ జరీనా, ప్రిన్సిపల్ శ్రీనివాసులును కార్యాలయంలో కలెక్టర్ సన్మానించారు. జపాన్‌లో జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు సుకుర సైన్స్ కార్యక్రమం నిర్వహించనుండగా.. 11వ జాతీయ స్థాయి మానాక్ ఇన్‌స్పైర్ అవార్డు పోటీలలో రాష్ట్రం నుంచి ముగ్గురు ఎంపికలో శివారెడ్డి ఉన్నారు. కొబ్బెరి పీచుతో చేసిన కుండీలతో.. ప్లాస్టిక్ కుండీల వాడకాన్ని నిరోధించి పర్యావరణాన్ని.. కాలుష్య రహితం చేసే ప్రాజెక్టును తయారు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమనరుల, డీఈవో గోవిందరాజు పాల్గొన్నారు.



విద్యార్థి గైడ్ టీచర్, ప్రిన్సిపాల్‌కు కలెక్టర్ సన్మానం

## టేస్టీ.. టేస్టీ.. హలీం



ఫొటోలు : బందిగె గోపి, మహబూబ్‌నగర్ ఫొటోగ్రాఫర్

మహబూబ్‌నగర్‌లో హలీం రుచులను ఆస్వాదిస్తున్న ప్రజలు

రంజాన్ మాసం వచ్చిందంటే ముస్లింల ఉపవాస దీక్షలతో పాటుగా గుర్తొచ్చేది హలీమ్..., ముస్లింలకు ఇఫ్తార్ విందులో ప్రముఖ వంటకమైన ఈ హలీమ్ మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ఇష్టమైన స్నాక్‌గా మారిపోయింది. రుచితో పాటుగా పౌష్టికత కలిగిన ఈ హలీమ్ లొట్టలు వేసుకుంటూ రుచులు చూస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో ఉమ్మడి జిల్లాలోని బేకరీలు, టీ హోటళ్ల వద్ద హలీమ్ కేంద్రాలు వెలిశాయి. కులమతాలకతీతంగా హలీమ్ రుచి చూసేందుకు అందరూ ఇష్టపడుతారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో రుచికరమైన హలీమ్ టేస్టీని ఆస్వాదించేందుకు వచ్చిన వారితో సాయంత్రమైతే చాలు కేంద్రాలన్నీ సందడిగా మారుతున్నాయి. ఈ వంటకాన్ని అరేబియన్స్ మనకు పరిచయం చేశారు. చికెన్‌తో వంటకాన్ని హరీస్ అని.. మటన్‌తో చేసే వంటకాన్ని హలీమ్ అంటారు. దీన్ని తయారు చేయడానికి దాదాపు 6 నుంచి 8 గంటల సమయం పడుతుంది. కేలరీలు అధికంగా ఉండే ఈ వంటకం ఆరోగ్యానికి మేలు చేయడంతోపాటు తక్షణ శక్తిని కలిగిస్తుంది. ఇందులోని పీచు పదార్థం వల్ల నెమ్మదిగా జీర్ణం అవుతుంది. అలాగే డ్రై ఫ్రూట్స్ చేర్చడంతో శరీరానికి మేలు కలుగుతుంది. ప్రతి 100 గ్రాముల హలీమ్‌లో 157 క్యాలరీలు, 9.7 గ్రాముల ప్రోటీన్, 6.86 గ్రాముల కొవ్వు పదార్థం, 15.2 గ్రాముల పిండి పదార్థాలు ఉంటాయి. విటమిన్ ఏ, ఈలు, యాంటీ యాక్సిడెంట్లు లభిస్తాయి. ఒక్క హలీమ్ ధర రూ.100 నుంచి ప్రారంభమవుతోంది. ఇది ఆయా ప్రాంతాలలో ఒక్కో రేట్‌కు విక్రయిస్తున్నారు. ఇంత శ్రేష్టమైనది కాబట్టే ఈ వంటకాన్ని రుచి చూసేందుకు ప్రతి ఒక్కరూ ఇష్టపడుతుంటారు.